ఓంశ్రీసాయిరాం

మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
దంబైన ఫాలనేత్రంబుతోడ
నల్లనేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగకంకణముతోడ
నడుమును చుట్టిన నాగచర్మముతోడ
మైనిండ నలరు భస్మంబుతోడ
నుదుట తీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనచాయ మేనితోడ
పర్తివాసుడు నేడు సాక్షాత్కరించె.

ప్రేమస్వరూపులారా!

సర్వమూ దక్షిణామూర్తి మయమే. అతనియొక్క రిఫ్లక్షన్, రియాక్షన్, రీసౌండ్... ఈ మూడింటియొక్క ప్రభావమే ఈ ప్రపంచము. దక్షిణామూర్తి బాలుడే. నాడు, నేడు, ఎప్పటికీ అతను బాలుడే. అయితే, అతని శిష్యులు మహా పవిత్రులై, పండితులై అనేకవిధములైన ప్రచారప్రబోధలు సల్పుతూ వచ్చారు. దక్షిణామూర్తియొక్క తత్త్వమును వర్ణించుటకు వీలుకాదు.

చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

ఇట్టి దక్షిణామూర్తిని ఏవిధముగా వర్ణించగలము! అతనిది మౌనబోధ. ఆ మౌనమే సర్వులకు సర్వ జ్ఞానమును ప్రసాదించును. ఆ మౌనము నుండియే సుజ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానములు ఆవిర్భవించుచున్నవి.

మానవునిది ఒక్క స్వరూపము కాదు. మూడు స్వరూపములు అతనిలో చేరియున్నవి. The one you think you are, the one others think you are, the one you really are.దక్షిణామూర్తి తనయొక్క ప్రచారప్రబోధలవల్ల మానవులను తమ నిజమైన తత్త్వాన్ని గుర్తించే రీతిగా తీర్చిదిద్దుతూ వచ్చాడు. అతను తెజస్సుతో, ప్రకాశముతో కూడిన సహజమైన స్వరూపాన్ని ధరించాడు. అతని ముఖముపై నిరంతరమూ చిరునవ్వులు చిందులు త్రొక్కుతూ ఉంటాయి. అట్టి దక్షిణామూర్తియొక్క తత్త్వమును వర్ణించుటకు వీలుకాదు. 'నిర్గుణం నిరంజనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. అట్టి దక్షిణామూర్తియొక్క స్వభావమును యేవిధంగా వర్ణించిననూ ఎవ్వరూ ప్రపంచంలో అర్థము చేసుకోలేరు. 'దక్షిణామూర్తి' అతని మూర్తి ప్రకాశవంతమైనది, ఆనందమయమైనది. అతను ప్రేమస్వరూపుడు, సత్యస్వరూపుడు.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగెను సర్వ సృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరండి.

సత్యము లేని స్థానము ఎక్కడను లేదు. ఏ పదార్థమునకైననూ మార్పు కలుగునుగాని, సత్యమునకు మార్పే లేదు.

ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి ఎక్కడైనా కచేరీ ప్రారంభించటానికి ముందుగా దక్షిణామూర్తిని స్మరించేది. దక్షిణామూర్తి స్మరణ లేకుండా, దక్షిణామూర్తి యొక్క ఇచ్ఛ లేకుండా, ఆయన సంకల్పము లేకుండా మానవుడు యే చిన్న కార్యమునుకూడను సాధించలేడు. దక్షిణామూర్తి నుండియే సర్వమూర్తులు బయలుదేరినవి. కాని, తాను మాత్రము ఎప్పటికీ బాలుడే. సర్వమూ తనయందే లీనమైయున్నవి. ఈవిధమైన దక్షిణామూర్తి తత్త్వమును తెలుసుకోటానికి అందరికీ సాధ్యముకాదు. దక్షిణామూర్తి ఎక్కడున్నాడు? సర్వత్రా వ్యాపించి ఉన్నాడు.

సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.

దృశ్యమును చూచే కన్నులయందు, శబ్దమును వినే కర్ణములందు, శ్వాస పీల్చే నాశికమునందు, మాటలు పలికే నాలుకయందు కూడను దక్షిణామూర్తి ఉన్నాడు. దక్షిణామూర్తి సర్వులయందు ఉంటున్నాడు. ఇట్టి దక్షిణామూర్తి తత్త్వాన్ని మనస్సునందు తల్చుకొని జీవితాన్ని నడిపించాలి. ఈశ్వరత్వము సర్వత్రా వ్యాపించినదే. భగవంతుడు లేనటువంటి స్థానము, భగవంతుడు కానటువంటి వస్తువు ఈ జగత్తులో కానరాదు. ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తి, ప్రతి జీవి, క్రిమికీటకాదులుకూడను దక్షిణామూర్తియొక్క ప్రభావములే. మానవుడు ఒక వస్తువును అనేక వస్తువులుగా మార్చవచ్చును.

శృంగారములు వేరు, బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే
జీవ జాతులు వేరు, జీవుండు ఒక్కడే
పూలజాతులు వేరు, పూజ ఒక్కటే
దర్శనంబులు వేరు, దైవమొక్కడే.

ఇలాంటి దక్షిణామూర్తియొక్క తత్త్వమును అందరూ గుర్తించవలసిన అవసరమున్నది. రామా, కృష్ణా, గోవిందా, నారాయణా అని భగవంతుని వివిధ నామములతో కీర్తిస్తుంటారు. కాని, ఈ నామములన్నీ పెట్టినవేగాని, పుట్టినవి కావు. అన్ని నామములు దక్షిణామూర్తియొక్క వర్ణనలే. దక్షిణామూర్తియొక్క తత్త్వము సర్వులయందుకూడను వ్యాపించి ఉన్నది. చైతన్య స్వరూపమే దక్షిణామూర్తి. కనుకనే, చైతన్యమెక్కడున్నదో అక్కడంతా దక్షిణామూర్తి ఉన్నాడు. ఈ చైతన్యము సర్వులయందూ ఉంటున్నది. కాని, మానవుడు దేహాభిమానముచేత తనయందున్న చైతన్యము గుర్తించుకోలేక పోతున్నాడు. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము ఈ ఐదింటియొక్క ప్రభావముచేతనే దక్షిణామూర్తి కనిపించకుండా ఉంటున్నాడు. వీనిపైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గములు కప్పి ఉన్నవి. ఈవిధంగా మనల్ని ఆవరించిన మేఘములను మనము ప్రక్కన నెట్టినప్పుడే దక్షిణామూర్తి స్వస్వరూపుడై మనకు ప్రత్యక్షమౌతాడు. ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు మేఘములు కప్పినప్పుడు కనిపించడు. అంతమాత్రము చేత సూర్యుడు లేడని చెప్పవచ్చునా? కొంతసేపు కాచుకొని ఉంటే, తప్పక మేఘములు కదలిపోతాయి. సూర్యుడు మనకు కనిపిస్తాడు. అదేరీతిగా, మానవుడు తనను కప్పియున్న కామ క్రోధాది అరిషడ్వర్గములనే మేఘములను దూరంగావించుకోవాలి. అవి ఏరీతిగా కదలిపోతాయి? చల్లని గాలి వీచినప్పుడే మేఘములు కదలిపోతాయి. అదేవిధముగనే, భగవన్నామమనే 'చల్లని గాలి' వీచినప్పుడు మానవుని కప్పియున్న అరిషడ్వర్గములనే మేఘములు తొలగిపోతాయి. భగవన్నామమును ఉచ్చరించుకుంటూ మనము భగవచ్చింతన చేస్తూ ఉనిడాలి. ఈ కామక్రోధాది అరిషడ్వర్గములు మానవునికి పుట్టుకతో వచ్చినవి కావు. ఇవి మధ్యలో మనకై మనము కల్పించుకున్నవే. మనకై మనము పెంచుకున్నవే. ఈ 'మేఘములు' తమంతట తాముగా రావు. ఒక్కొక్కటి చిన్నచిన్నగా చేరి, తర్వాత అదొక పెద్ద మేఘముగా తయరౌతుంది. పెరిగేకొలదీ మానవునికి కోరికలుకూడా పెరుగుతుంటాయి. చేతికి ఒకే గాజు ఉన్నప్పుడు అది శబ్దం చేయదు. రెండు గజులు చేరితే శబ్దం ప్రారంభమవుతుంది. మొట్టమొదట మానవుడు ఒకే వ్యక్తిగా ఉంటాడు. కొంతకాలమునకు అతనిలో భ్రాంతి అభివృద్ధి అవుతుంది. అదే కామము. దాని వల్ల భార్య వస్తుంది. అప్పుడు ఇద్దరౌతారు. ఈ ఇద్దరే క్రమక్రమేణ పన్నెండుమంది అవుతారు. అనగా ఏమిటి, వారికి పిల్లలు పుడతారు. మళ్ళీ ఆ పిల్లలికి పిల్లలు పుడతారు. ఈవిధంగా సంబంధబాంధవ్యాలు పెరుగుతూ పోతాయి. ఇవన్నీ మనం పెంచుకునేటువంటివేగాని, భగవంతుడు ప్రసాదించినవి కావు కదా! కనుక, చిన్న వయస్సునందే మనము భ్రాంతికి చోటివ్వకుండా చూసుకోవాలి. దక్షిణామూర్తి బోధించిన సాధన ఇదియే. తాను ఎప్పుడుకూడను చిన్న

పిల్లవానివలె ఉంటూ వచ్చాడు. తాను ఎట్టి బంధములందూ చిక్కుకోలేదు. దక్షిణామూర్తి అనుగ్రహమును మనము అందుకోవాలంటే దక్షిణామూర్తి మార్గమును అనుసరించాలి. మానవుడు మానవునిగానే జీవించాలి, పశువుగా మారకూడదు. తాను మానవతా గుణములను పోషించుకున్నప్పుడే మానవుడనని చెప్పుకోవటానికి వీలవుతుంది. లేకపోతే తాను పశువుగా మారిపోయే ప్రమాదముంది. పశువులందే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు అధికంగా ఉంటాయి. ప్రతి వ్యక్తి, 'నేను మానవుడను, పశువును కాదు' అని తనకు తాను గుర్తు చేసుకుంటూ ఉండాలి. 'నేను కేవలం మానవుడను కాదు. నేను దైవాన్ని' అని విశ్వసించాలి. ఈ సత్యాన్ని గుర్తించటంలో మానవునికి మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు, అహంకారము ఇవన్నీ అడ్డు తగులుతుంటాయి.

'ఇది నా కర్చీఫ్' అంటున్నాను. కాబట్టి కర్చీఫ్ వేరు, నేను వేరు. 'ఈ టంబ్లరు నాది' అంటావు. కాబట్టి, టంబ్లరు నీవు కాదు. అదేరీతిగా, 'ఇది నా దేహము' అంటావు. కనుక, దేహము వేరు, నీవు వేరు. 'నా మైండు' అన్నప్పుడు నీవు వేరు, మైండు వేరు. మరి నీవెవరు? వీటన్నింటికంటె నీవు ప్రత్యేకంగా ఉండటం చేతనే కదా 'ఇది నా దేహము, నా మనస్సు' అని చెప్పగల్గుతున్నావు. కాబట్టి, నీవు నీవే! నీవు దేహము కాదు. మనస్సు కాదు. బుద్ధి కాదు. చిత్తము కాదు. ఇంద్రియము కాదు. అంతఃకరణ కాదు. ఇవన్నీ నీవు చేర్చుకోటం చేతనే బంధితుడవైపోయావు. ఒక్కొక్క దానిచేత మనము ఒక్కొక్క విధమైన గుణమును పెంచుకుంటున్నాము.

వక్కపొడి, తమలపాకు, సున్నము మూడూ కలిపినప్పుడే తాంబూలం తయారౌతుంది. సున్నము కలిపినప్పుడే ఎరుపు రంగు వస్తుంది. అయితే, దానిని అధికంగా వేసుకోకూడదు. తక్కువగానే వేసుకోవాలి. అదేరీతిగా, ప్రతి ఒక్క బాధ్యతను మానవుడు ఒక లిమిట్‌లో ఉంచుకోవాలి. మనిషి అనేవాడు ప్రతి విషయంలోను ఒక లిమిట్‌ను పాటించినప్పుడే తాను మనిషిగా జీవించగల్గుతాడు. హద్దులు మీరితే వాడు మనిషి కాడు, రాక్షసుడౌతాడు. మానవుడు మానవునిగా బ్రతకాలి. 'మానవ' అనే పదములో 'మా' అనగా మాయ, మమత. 'న' అనగా లేకుండా. 'వ' అనగా వర్తించటం. కాబట్టి, మాయ లేకుండా ప్రవర్తించినప్పుడే నీవు నిజమైన మానవుడ వవుతావు. ఇట్టి పవిత్రమైన జ్ఞానమును బోధించినవాడే దక్షిణామూర్తి. నీవు దేహమును ధరించినవాడైనప్పటికీ దేహముతో యేమాత్రమూ సంబంధము పెట్టుకోకూడదు.

ప్రేమస్వరూపులారా! మనలో ఉన్నటువంటిది, ముఖ్యమైనది ప్రేమయే! మొట్టమొదట తల్లి మనకు అందించినది ప్రేమయే. Love is God, live in love. ప్రేమయే దైవం. నీవు ప్రేమతోనే జీవించాలి. ఎవరిని చూసినా నీవు దైవస్వరూపునిగా భావించాలి. నిన్ను ద్వేషించేవాడు ఎదురైనప్పుడు వానికికూడా నమస్కరించాలి. అప్పుడే నీవు సరియైన మానవుడ వవుతావు.

మనస్సుకు మనస్సు సాక్షి
దేహమునకు గుణం సాక్షి
మూఢునకు మూర్ఖం సాక్షి
సర్వమునకు స్వామి సాక్షి.

మనం మూఢులం కాకూడదు. మనం మూఢుల్లో చేరినప్పుడే మనకు అన్నివిధాలుగా బాధలు, భేదాలు కలుగుతాయి.

ప్రేమస్వరూపులారా! ఈ జగత్తు లోపల మూఢుడు కానివాడు ఒక్కడూ లేడు. కాని, దాంట్లో స్థాయిలు వేరువేరుగా ఉన్నాయి. నిరంతరము భగవచ్చింతన చేసేవాడు చాలా ఉత్తముడు. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరి చింతనం'. మీరు నిరంతరం భగవచ్చింతనలో ఉండాలి. మీ దేహాన్నికూడను భగవత్కార్యాల్లో ప్రవేశపెట్టాలి. మీ జీవితమే భగన్మయంగా మారాలి. మానవుడు 'డివైన్ లైఫ్'ను గడిపినప్పుడే అతనికి బుద్ధి వికాసం కలుగుతుంది. మీరు 'డివోషన్'ను అభివృద్ధిపరచుకున్నప్పుడే మీ జీవితం 'డివైన్'గా రూపొందుతుంది. మీ మనవత్వం సార్థకమవుతుంది. మీ జన్మ తరిస్తుంది. మీరు మొట్టమొదట నిజమైన మానవులుగా జీవించాలి. అప్పుడే మాధవత్వాన్ని పొందగలరు. త్రేతాయుగంలో రాములను రాములుగానే భావించారు మొట్టమొదట. కాని, రావణ మర్దన గావించి దుర్గుణాలను అణచివేసిన తర్వాత జనుల దృష్టిలో రాముడు దేవుడుగా మారినాడు.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములతో కూడి ఉన్నంతవరకు మనము ఆనందాన్ని అనుభవించలేము. నీవు ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. ఎందుకనగా, దైవము ఆనందస్వరూపుడు.

నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వందాతీతం గగన సృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం.......

ఇట్టి ద్వంద్వాతీత స్థితిలో జీవించినప్పుడే మనం నిజమైన మానవులుగా రూపొందుతాము. ఏమైనా దుర్గుణాలు నీలో బయలుదేరెనా, వాటిని దూరం చేసుకొనే నిమిత్తం నీవు భగవన్నామమును స్మరించు. దైవాన్ని స్మరించినప్పుడు నీవుకూడా దైవంగా మారిపోతావు.

ప్రేమస్వరూపులారా! మీరందరూ నిజంగా ప్రేమస్వరూపులే! ప్రేమ లేకుండా ఒక్క క్షణమైనా మీరుండలేరు. కాని, మీరు ప్రేమను ఎన్ని రకాలుగానో మార్చుకుంటున్నారు. దైవప్రేమను మీరు అభివృద్ధిపరచుకోండి. ప్రేమస్వరూపులుగా జీవించండి. క్రమక్రమేణా దైవత్వాన్ని పొందండి. ఇదే ఈనాడు నేను మీకందించే ముఖ్యమైన సందేశం.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భంగా భగవాన్‌బాబావారు సాయికుల్వంత్‌లో 11ఆగష్టు2006 సాయంత్రం యిచ్చిన సందేశము)